క్లుప్తంగా

లక్ష్యంతో ముందుకు సాగాలి

డీఎస్పీ బెజవాడ మెహర జయరాం ప్రసాద్



జ్యోతి ప్రజ్వల చేస్తున్న డీఎస్పీ

గురజాల : విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని డీఎస్పీ బెజవాడ మెహర జయరాం ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శివాణి విద్యానికేతన్ వార్షిక వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమానికి టీవీ ఆర్టీస్టు ఇంద్రనీల్, హీరోయిన్ ఎ.స్వప్న చౌదరి, డైరెక్టర్ టి.సాయిక్రిష్ణ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.రవిబాబు, ముద్రా స్కూల్స్ డైరెక్టర్ జీ.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్లు



పూజలు నిర్వహిస్తున్న మాజీ జెడ్పీటీసీ రామిరెడ్డి

పిడుగురాళ్ల రూరల్: కోనంకి గ్రామంలో వేంచేసిన నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి 11వ వార్షికోత్సవం తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు కలశాలతో దేవాలయం వద్దకు చేరుకొని పూజలు చేపట్టారు. పసుపు, కుంకుమ, గాజులతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన అమ్మవారి కుంకమ బండ్ల ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నాయి. భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

కారెంపూడి: త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు పేటసన్నెగండ్ల గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. హిందూ ధర్మాన్ని ప్రబోధించే గ్రంథాలను ప్రజలకు నామమాత్రపు ధరకు అందించారు. ఉగాది విశిష్టతను తెలిపే ఆచార్య ప్రబోధానంద పుస్తకాలను అందించారు. కటికం సైదారావు, కె.అరుణ, కె.కోటేశ్వరరావు, జి.సురేష్, బి.సాయి, కె.నారాయణమ్మ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

మాచర్ల నాటుసారా, తెలంగాణ మద్యం అక్రమ రవాణాలో పట్టుబడ్డ వాహనాలకు పట్టణంలోని ఎస్ఈబీ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

గురజాలలో..

గురజాల: పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఎస్ఈబీ ఎస్ఐ జయరాం తెలిపారు. గురజాల సెబ్ స్టేషన్ పరిధిలో వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ ఆలయం సందర్శన

విజయపురిసౌత్: బొయ్యారం సమీపంలోని శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని ఏబీబీఎస్ అధ్యక్షుడు జటావత్ రాంబాబు నాయక్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు కరంటోత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. ముందుగా సభ్యులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని రాంబాబు నాయక్ పేర్కొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బాణావత్ రాము నాయక్, కోటేశ్వరరావు నాయక్, బర్మా నాయక్, రమావత్ భీమా నాయక్, బాబు నాయక్, ఆలయ పూజారి శ్రీను నాయక్ పాల్గొన్నారు.

ప్రతి ముస్లిం అల్లాను ఆరాధించాలి

పిడుగురాళ్ల రూరల్: ప్రతి ముస్లిం నిత్యం అల్లాను ప్రార్థిస్తూ నమాజు చేయాలని మత గురువు ఆమీషా షేక్ అబ్దుల్ రషీద్ అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలో ఇస్తామా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 700 మంది హాజరయ్యారు. మత గురువు మాట్లాడుతూ ముస్లింలు ఇస్తామాలో పాల్గొనడం దేవుని వరమన్నారు. గడ్డం వలి, షేక్ గని, జిలానీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

నకరికల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చల్లగుండ్ల అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన అన్నవరపు ప్రసాద్ ద్విచక్ర వాహనంపై నరసరావుపేట నుంచి నకరికల్లుకు వస్తున్నాడు. అడ్డరోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి పడడంతో.. తలకు గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్పందించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో హుటా హుటీన నరసరావుపేట ఏరియా వైద్యశాలకు అతనిని తరలించారు.

జగనన్న కాలనీలకు.. జలధార

- మూడు మున్సిపాలిటీలకు రూ.14.77 కోట్ల నిధులు
- ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్
- 14 లే అవుట్లలో కొళాయిల ఏర్పాటు



పిడుగురాళ్ల లెనిన్ నగర్‌లో జగనన్న కాలనీలో గృహాల నిర్మాణం

పిడుగురాళ్ల: పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతిల్లు ఒక తీరని కల. ఆ కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. వైఎస్సార్ జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. లక్ష్యం దిశగా సాగుతున్నారు. ఇందులో భాగంగానే గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీల్లోని జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరాకు అమృత్ 2 పథకంలో భాగంగా రూ.14.77 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో జగనన్న కాలనీల్లో తాగునీటి పైపులైన్ పనులు చకచక జరగనున్నాయి. ఒక్క పిడుగురాళ్ల పట్టణంలోనే సుమారు 14 వేల గృహాలు ప్రభుత్వం మంజూరు చేయగా..అందులో 5 వేల మందికి పట్టాల పంపిణీ చేసింది. అంటే పేదలు ఎంత మంది ఉన్నా అందరికీ నివేశన స్థలాలు, గృహాలు ఉండాలనేది ప్రభుత్వ సంకల్పం. నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీల్లో ప్రత్యేక నిధులు మంజూరు అయ్యేందుకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తన వంతు కృషి చేస్తున్నారు.

మున్సిపాలిటీలు..గృహాలు

గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల మున్సిపాలిటీ పరిధిలో లెనిన్ నగర్, సీతారామపురం, ఆదర్శనగర్, స్వర్ణా పిచ్చయ్య కాలనీల్లో వైఎస్సార్ జగనన్న లే అవుట్లు వేశారు. రెండు విడతల్లో 3,797 మందికి పట్టాలు అందించి, ఇళ్లు నిర్మిస్తున్నారు. దాచేపల్లి మున్సిపాలిటీలో నాయుడు పేటలో రెండు, కేశానుపల్లి ప్రాంతంలో మూడు, ఇరికేపల్లిలో ఒకటి మొత్తం ఆరు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. 2,118 మందికి పట్టాలు అందించి, ఇళ్లు నిర్మిస్తున్నారు. గురజాల మున్సిపాలిటీలో జంగమహేశ్వరపురంలో 1, జేఎంపీ కాలనీలో 2, ఎస్సీ కాలనీలో 1 మొత్తం నాలుగు లేఅవుట్లలో.. 1,496 మందికి పట్టాలు మంజూరు చేసి, గృహాలు నిర్మిస్తున్నారు. మొత్తం 7,411 గృహాలకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. దీంతో పేదల ఇళ్లు..అన్ని మౌలిక వసతులు సంతరించుకోనున్నాయి.



పూర్తి అయిన జగనన్న కాలనీలోని గృహం

అన్ని సౌకర్యాలతో ఇల్లు..



జగనన్న మా కష్టాలు తెలుసుకొన్నారు. జగనన్న కాలనీలో మాకు స్థలం ఇచ్చారు. ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు.. కావాల్సిన తాగునీరు, కరెంట్, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పిస్తున్నారు. మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇటువంటి ముఖ్యమంత్రి మాకు ఎప్పుడూ ఉండాలి.

– అజ్మీర మేరిబాయి, 6వ వార్డు, పిడుగురాళ్ల

అన్ని వసతులు కల్పిస్తున్నాం..



జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికి పైపు లైన్‌లు ఏర్పాటు చేయటం జరుగుతుంది. ముందుగా నీటి పైపులైన్లు ఏర్పాటు చేసి, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడం జరుగుతుంది. ఇప్పటికే వీధి లైట్లు ఏర్పాటు చేయటంతో పాటు నిర్మాణాలు పూర్తి అయిన గృహాలకు విద్యుత్ సరఫరా అందించటం జరిగింది. ఈ క్రమంలోనే కాలనీలో మంచినీటి వసతి కోసం నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా జరుగుతున్నాయి.

– ఎ.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ పిడుగురాళ్ల

రైతుల్లో అకాల వర్షం ఆందోళన



పిడుగురాళ్ల శివారులో ఆరబోసిన మిర్చి



వర్షం అనంతరం పట్టలపై నీటిని తొలగిస్తున్న రైతులు

పిడుగురాళ్ల: అకాల వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పొలాల్లో మిరప కాయలు కోసి ఆరబెట్టారు. మిరపకాయలు తడవకుండా టార్పాలిన్ పట్టలను కప్పారు. ఆదివారం మధ్యాహ్నం కొంత సమయం ఎండ రావటంతో తడిచిన మిరపకాయలను ఆరబెట్టుకున్నారు.

కారెంపూడిలో వడగండ్ల వాన

కారెంపూడి: కారెంపూడిలో ఆదివారం సాయంత్రం పది నిమిషాల పాటు వడగండ్ల వాన పడింది. వర్షంలో చిన్న సైజు వడగండ్లు పడ్డాయి. మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడుతున్నాయి. దీంతో కల్లాల్లో మిర్చి, మొక్క జొన్న ఎండ బెట్టిన రైతులు అగచాట్లు పడుతున్నారు. పట్టల కింద ఉన్న పంటలను ఎండకు ఆరబెట్టడం.. వర్షం పడే సూచనలుంటే మళ్లీ పట్టలు కప్పడం.. వర్షం తగ్గగానే పట్టలపై నిలిచిన నీటిని తొలగించడం ..వారి పనయ్యింది.

నకరికల్లులో అంధకారం

నకరికల్లు: నకరికల్లులో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. నకరికల్లులో మొత్తం 70 విద్యుత్ స్తంభాలు కూలి పోవడంతో రాత్రంతా ప్రజలు అంధకారంలో గడిపారు. విద్యుత్ లేక తాగునీటి సరఫరా నిలిచిపోయి..అవస్థలు పడ్డారు. మరోవైపు ఫోన్లు కూడా మూగబోయాయి. నెట్ వర్క్ పనిచేయకపోవడంతో ప్రజల మధ్య సంబంధాలు తెగిపోయినట్లు అయ్యింది. ఈదురు గాలుల ధాటికి కూలినపోయిన విద్యుత్ స్తంభాల మరమ్మతులను విద్యుత్ శాఖ ముమ్మరం చేసింది. ఆదివారం రాత్రికి గాజులగడ్డ, బ్యాంకు బజారు, మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్దరిస్తామని, మిగతా ప్రాంతాల్లో మరో రెండు రోజులు పడుతాయని చెప్పారు.

పెనుగాలికి నేలకొరిగిన చెట్లు

పిడుగురాళ్ల రూరల్: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పెను గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. పెనుగాలి దాటికి పందిటివారిపాలె వద్ద కారంపూడి- పిడుగురాళ్ల రహదారిపై చెట్టు విరిగిపడింది. దీంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న అధికారులు చెట్టును తొలగించే ప్రయత్నం చేశారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



నకరికల్లులో విద్యుత్ స్తంభాల మరమ్మతులు

మంచినీటి బోరు ప్రారంభం



బోరు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీను

విజయపురిసౌత్: నాగులవరం గ్రామంలో ఆదివారం ఎంపీపీ బూడిద శ్రీను నూతన తాగునీటి బోరును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి స్థానికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకం దారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 80వేలు ఆర్థిక సాయం



సైదానాయక్ కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు

విజయపురిసౌత్: చింతల తండా గ్రామ సమీపంలోని ఎయిర్‌పోర్ట్ వద్ద పొలంలో ఈ నెల 16న పిడుగుపడి రమావత్ సైదా నాయక్ మృతి చెందగా.. మన్నేనాయక్ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సైదా నాయక్ కుటుంబానికి రూ.65వేలు, మన్నేనాయక్ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం సేవా సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బర్మానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. సంఘం నాయకులు రాము నాయక్, ఏడుకొండలు నాయక్, బాబు నాయక్, బాణావత్ శంకర్ నాయక్, భీమా నాయక్, రమేష్ నాయక్, ఉదయ్ నాయక్, శ్రీను నాయక్, స్కైటీం సభ్యులు మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, చింతలతండా సర్పంచ్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది కవి సమ్మేళనం



కవులను సన్మానించిన సభ్యులు

మాచర్ల: సమాజాన్ని నిద్ర లేపేది, అన్యాయాలను ఎలుగెత్తి ప్రపంచానికి తెలియజేసేదే కవిత్వమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ కమలాసనరావు పర్యవేక్షించారు. ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ కవులను సత్కరించటం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే కవులలోనూ పలు రకాలైన వారున్నారన్నారు. పందిరి శ్రీశైలం, శ్రీరామదాసు అమర్‌నాథ్, దిబ్బల దాసు, కొణతం నాగేశ్వరరావు, భవాని ప్రసాద్, రాంబాబు, పలువురు కవులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జేవీకేఎస్ ప్రసాద్, కొత్తమాసు గిరిజ, ముప్పవరపు గాంధీ, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కార్యదర్శులు పందిరి నరసింహారావు, బచ్చు రాజ్ కుమార్, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, చుండూరు సత్యనారాయణ, మేడా వెంకట లక్ష్మి, పరిటాల ధనలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభ్యున్నతి



అక్బర్‌ను సన్మానిస్తున్న అంజుమన్ కమిటీ ప్రతినిధులు

కారెంపూడి: పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన షేక్ అక్బర్‌ను మండల అంజుమన్ కమిటీ ఆదివారం సాయంత్రం ఘనంగా సన్మానించింది. కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు షేక్ అరీఫ్ అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ షేక్ షఫీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేయూత వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించామని తెలిపారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి అందిస్తున్న చేయూత మరువలేనిదన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన అక్బర్‌కు చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి కష్టపడి పనిచేసేవారిని గుర్తించినట్లు అయ్యిందన్నారు. కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆరీఫ్, షేక్ యాసిన్, ప్రతినిధులు కేకేవీ వలి, మస్తాన్ జానీ, ఖాసిమ్, అబ్దుల్ ఖాదర్, అగ్గుమ్, యాసిన్, సాజన్, సుభాని, పఠాన్ జాని, బ్యాటరీ బాషా, చోటా కరీమ్, మస్తాన్, తండా సుభాని, మునీర్, చిష్టి మొహిద్దీన్, షాబీర్, చిన్ని, సాయి తదితరులు అక్బర్‌ను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ రమావతు తేజానాయక్, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్, వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, చెన్నకేశవస్వామి ట్రస్టుబోర్డ్ చైర్మన్ చల్లా ప్రసాద్, కొమ్ము చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సెల్ టవర్ తొలగించాలని ఆందోళన..



మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో రుద్రవరం గ్రామానికి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలంటూ నివాసితులు ఆదివారం ఆందోళన చేపట్టారు. సెల్ టవర్ నుంచి వెలువడే రేడియేషన్‌తో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరారు. చిన్నారులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వస్తున్నాయని చెప్పారు. సెల్ టవర్‌కు సంబంధించి గడువు ముగిసిందని, మరలా పునరుద్ధరించేందుకు అనుమతి మంజూరు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రామారావు, జవ్వాజి కొండలు, జవ్వాజి శేషు, గోపీ, సైదుబాబు, అయ్యప్ప, వెంకటసైదయ్య, సుబ్బారావు, తాళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు చెదిరిపోకుండా..




ఉపాధ్యాయుల కార్యాలయం ఆధునీకీకరణ

దాచేపల్లి: పాత జ్ఞాపకాలు చెరిగిపోకుండా.. నాటి స్మృతులు కలకాలం గుర్తుండేలా పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. వారి సహకారంతో దాచేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల కార్యాలయం భవనం పనులు చకచక జరుగుతున్నాయి. 1917లో దాచేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌ను స్థాపించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. పూర్వ విద్యార్థి, గామాలపాడుకు చెందిన జంగాకృష్ణమూర్తి రెండుసార్లు గురజాల ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా పనిచేస్తున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. నూతన తరగతి గదులు ప్రభుత్వం నిధులు మంజూరు చేయటంతో నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఇందుకు అవసరమైన 7 సెంట్ల స్థలాన్ని రూ.10లక్షల వ్యయంతో పూర్వ విద్యార్థులు కొనుగోలు చేసి, పాఠశాలకు అప్పగించారు. అంతే కాకుండా ఉపాధ్యాయుల కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో.. ఆధునికీకరణ చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. సూమారుగా రూ.25లక్షలతో పనులు చేపట్టారు. పాత పైకప్పు తొలగించి.. నూతన కప్పును ఏర్పాటు చేశారు. పాత భవనం ఏ విధంగా ఉందో.. ఆధునికీకరణ అనంతరం అలాగే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తున్నారు. ఆధునికీకరణ పనులకు ఇంకా నిధులు అవసరం ఉండటంతో పూర్వ విద్యార్థుల ద్వారా సేకరించేందుకు కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారు.

మంచి మనస్సున్న సీఎం..వైఎస్ జగన్

కిడ్నీ వైద్యానికి రూ.15 లక్షల 'సహాయం' మంజూరు



ఉత్తర్వులు కాపీ

రెంటచింతల: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తనకు కిడ్నీ మార్పిడి వైద్యం కోసం రూ.15లక్షలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మంచి మనస్సును చాటుకున్నారని రెంటచింతలకు చెందిన మద్దిగపు కృష్ణ మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణ మోహన్‌రెడ్డికి వైద్య సహాయం అందజేసేందుకు సీఎం సహాయనిధి ప్రత్యేకాధికారి ఎం.హరికృష్ణ ఉత్తర్వులు జారీ చేయగా దానిని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి.. బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేసిన పిన్నెల్లికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

దుర్గి: దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలోని కేశఖండన శాలలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో కేశఖండన శాలలో క్షురకర్మలు చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 20వేల చొప్పున కమిషన్ అందించాలని జీఓ 110ని క్యాబినెట్ ఆమోదించటం హర్షణీయమన్నారు. గతంలో దేవాదాయ పాలకవర్గ మండళ్లలో తమ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించి, ఆత్మగౌరవాన్ని పెంపొందించిన విధానం పట్ల తమ సామాజిక వర్గం సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు తమ జాతి పట్ల అవహేళన చేసి కించపరిచిన ఉదంతాన్ని గుర్తుచేశారు. రాబోవు రోజులలో తాము సీఎం జగన్ వెంట నడుస్తామని పలువురు నాయకులు అన్నారు. ముటుకూరు ఏడుకొండలు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, మాచర్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ముటుకూరు అనిల్, నాగరాజు, ధరణీకోట బాజీ, కామేపల్లి కొండలరావు, పురం చెన్నకేశవరావు, తెంపల్లి సుబ్బారావు ధూపాటి మల్లికార్జున, దొడ్డి చింతల ఎల్లమంద పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకుంటాం



మిర్చి పంటను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ రమేష్

మాచవరం: అకాల వర్షం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న మిర్చి పంటలను పిడుగురాళ్ల ఏఎంసీ వైస్ చైర్మన్ వంకాయల రమేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. నష్టపోయిన పంటలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిహారం అందజేస్తుందన్నారు. పంటల నష్టాన్ని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డితో మాట్లాడి, రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆదివారం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకొని ఆలయ శుద్ధి చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, అర్చన సేవల అనంతరం శ్రీవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రంతో అర్చకులు పూర్తిగా కప్పివేశారు. సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలంతో ప్రదక్షిణగా వెళ్లి.. ఆలయ శుద్ధి చేపట్టారు. ఆలయ శుద్ధి అనంతరం స్వామివారిపై కప్పిన వస్త్రాన్ని తొలగించి, ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమానికి శ్రీవారి సేవా సమాజం, నారాయణ సేన నగర సంకీర్తన బృందం పాల్గొన్నారు. అర్చకులు వారికీ శ్రీవారి మంగళ శాసనలు అందజేశారు.

బైక్ అదుపుతప్పి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నకరికల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చల్లగుండ్ల అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన అన్నవరపు ప్రసాద్ ద్విచక్ర వాహనంపై నరసరావుపేట నుంచి నకరికల్లుకు వస్తున్నాడు. అడ్డరోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి పడడంతో.. తలకు గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్పందించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో హుటా హుటీన నరసరావుపేట ఏరియా వైద్యశాలకు అతనిని తరలించారు.